క్లుప్తంగా

మట్టి చదును పనులకు భూమిపూజ

ఏలేశ్వరం: స్థానిక చైతన్యనగర్ కాలనీలో మట్టి చదును పనులకు సోమవారం భూమిపూజ చేశారు. పట్టణంలో ఇటీవల నిర్వహించిన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల విన్నపాల మేరకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ మట్టిచదును చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ నేత అలమండ చలమయ్య మట్టిచదును పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మనప్రభుత్వంలో వస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, యండగండి నాగబాబు, కోనాల వెంకటరమణ, అలమండ వీరరాఘవస్వామి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



జి.కొత్తపల్లిలో బాధితులకు నిత్యావసరాలు, నగదు అందజేస్తున్న సర్పంచ్ విజయదుర్గ

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో అగ్ని ప్రమాద బాధితులకు సోమవారం గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ ఆర్థిక సాయం చేశారు. గ్రామంలోని పెద్దాడ చంటమ్మ, నురుకుర్తి నాగలక్ష్మిలకు చెందిన తాటాకిళ్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యాయి. దీంతో సర్పంచ్ ఈగల విజయదుర్గ బాధిత కుటుంబాలకు బియ్యం, కూరగాయ లు, నగదు అందజేశారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈగల అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోన బాబ్జీ, ఎడ్ల సత్యనారాయణ, కె.నూకరాజు, ఎం.సత్తిబాబు, ఎల్.రమణ తదితరులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో రోడ్లకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను సోమవారం స్థానిక ఎస్సై టి.రాఘునాథరావు ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కలిపించడం లేదన్నారు. దీంతో జగపతినగరం శివారు దుర్గమ్మ మలుపులో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించడంతో పాటు రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన మట్టిని తొలగిస్తున్నట్లు తెలిపారు. గుడాల రాంబాబు పాల్గొన్నారు.

శివాలయ అభివృద్ధి పనుల పరిశీలన



ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ రాజబాబు, నాయకులు

శంఖవరం: అన్నవరం దేవస్థానం దత్తత ఆలయమైన స్థానిక శివాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఎంపీపీ పర్వత రాజబాబు పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనులు, సత్యదేవా కల్యాణ మండపం మరమ్మతు పనులను ఆయన తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ ఆలయ అభివృద్ధికి అన్నవరం దేవస్థానం రూ.53.50 లక్షల నిధులను మంజూరు చేసింది. ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు బొమ్మిడి లిల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ధారపల్లిలో ఉమారామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధారపల్లి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామావళి, పంచామృత అభిషేకాలు చేశారు. పెద్దిపాలెం, ఉత్తరకంచి తదితర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ సర్వసభ్య సమావేశం

గండేపల్లి: గ్రామంలో సోమవారం టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ శ్రేణులకు దిశనిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ఈ నెల 15న నిర్వహించే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

అల..తల్లీబిడ్డల సేవలో..

- 102 సర్వీస్ ద్వారా బాలింతలకు మెరుగైన సేవలు
- పైసా ఖర్చు లేకుండా ఇంటికి చేరుస్తున్న వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ప్రత్తిపాడు సీహెచ్‌సీ నుంచి బాలింతను ఇంటికి చేరుస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్



ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద సిద్ధంగా ఉన్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు

ప్రత్తిపాడు: గర్భిణుల ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను ఆసుపత్రి నుంచి వారి ఇళ్లకు క్షేమంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ (102 సర్వీసు) అందిస్తున్న సేవల పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఉన్న ఈ పథకం వాహనాలను ప్రస్తుత ప్రభుత్వం అధునీకరించి నూతన సాంకేతికతతో అందుబాటులోకి తీసుకువచ్చింది. బాలింత చేరే గమ్యం ఎంత దూరమైనా... ఏప్రాంతమైనా... తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ముందుకు వచ్చి క్షేమంగా పైసా ఖర్చు లేకుండా ఇంటికి చేరుస్తోంది. ఉచితంగా తల్లీబిడ్డలను ఇంటికి చేరవేస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

మూడు నియోజకవర్గాల్లో.. : రాష్ట్ర ప్రభుత్వం అధునీకరించిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలు ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట నియోజకవర్గాల్లో మరింత మెరుగ్గా ఉన్నాయి. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. అప్పట్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కు ఒకటి చొప్పున మూడు నియోజకవర్గాలకు నాలుగు వాహనాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇవి మరమ్మతులకు గురైనా అప్పటి ప్రభుత్వం ఒక్క పైసా కూడా విదిలించేది కాదు. అంతేగాక ఒక్కొక్క వాహనంలో నలుగురు లేక ఐదుగురు బాలింతను తీసుకెళ్లేవారు. బాలింత ఆసుపత్రి నుంచి ఉదయం డిస్చార్జ్ అయినా సాయంత్రం వరకూ తమ ఇళ్లకు వెళ్లే పరిస్థితి ఉండేది కాదు. ఇక ప్రత్తిపాడులోని వాహనమైతే నెలల తరబడి మరమ్మతుల కోసం ఎదురు చూసేది. బాలింతలు సొమ్ములు ఖర్చు చేసుకుని ఏర్పాటు చేసుకున్న వాహనాల్లోనే తమ ఇళ్లకు వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేనే లేదు.

బాలింతల సంక్షేమానికి ప్రాధాన్యం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాలింతల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చింది. తల్లీబిడ్డల సేవలకు అధునీకరించిన వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. తుని ఏరియా ఆస్పత్రికి మూడు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గోకవరం ఆసుపత్రులకు రెండేసి, రౌతులపూడి, జగ్గంపేట, కోటనందూరు ఆసుపత్రులకు ఒక్కొక్కటి వంతున 12 వాహనాలను కేటాయించింది. ఈ వాహనాలు ఆయా ఆసుపత్రులకే పరిమితం కాకుండా సమీప మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా సేవలను అందిస్తున్నాయి. ఒక్కొక్క తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో నెలకు 40 నుంచి 80 మంది బాలింతలను సొంత ఇళ్లకు చేరుస్తున్నాయి. ఈ ఈవాహనాల్లో బాలింతల ఆధార్‌తో సహా పూర్తి సమాచారాన్ని లాక్ బుక్, ఫీల్డ్ బుక్‌ల్లో నమోదు చేస్తారు. ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను ఉచితంగా ఈ వాహనాల ద్వారా ఇళ్లకు చేరుస్తున్నారు. ఈసేవలతో బాలింతలు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సేవలు బాగున్నాయి



గతంలో ఆసుపత్రి నుంచి బాలింత ఇంటికి వెళ్లాలంటే ఎంతో ఖర్చయ్యేది. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం తర్వాత డిశ్చార్జీ చేసిన రోజే పైసా ఖర్చు లేకుండా ఉచితంగా, ఎటువంటి ప్రయాస లేకుండా ఇంటికి వెళ్తున్నాం. తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవలు బాగున్నాయి.

– గండి రాణి, బాలింత, సిరిపురం, ఏలేశ్వరం మండలం.

క్షేమంగా ఇళ్లకు చేర్చడమే లక్ష్యం



గతంలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ అయిన బాలింతలు ఎవరికి వారే వాహనాలను ఏర్పాటు చేసుకుని ఇళ్లకు వెళ్లేవారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఎంత దూరమైనా సొంతిళ్లకు చేరుస్తోంది. తల్లీబిడ్డలను క్షేమంగా ఇంటికి చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– నామా రాజేష్, పైలట్, 102 సర్వీసు పైలట్, ప్రత్తిపాడు

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన



ఎస్.అన్నవరంలో కమ్యూనిటీ హాలుకు భూమి పూజ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో నూకాలమ్మ గుడికి ఎదుట కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సోమవారం భూమి పూజ చేశారు. కమ్యూనిటీ భవనానికి సీఎండీఎఫ్ నిధులు రూ.27 లక్షలు మంజూరైనట్టు మంత్రి దాడిశెట్టి రాజా తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి, భవనాన్ని అప్పగించాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తలుపులమ్మ సన్నిధిలో వాణిజ్య పన్నులశాఖ అధికారి పూజలు

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారిని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ సుమతి సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి వచ్చిన జాయింట్ కమిషనర్ సుమతికి పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కాకినాడ జిల్లా పరిషత్ అధికారి (సీఈఓ) ఎన్.వీర వెంకట సత్యనారాయణ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం వీరికి ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సూచించారు. స్థానిక వేదిక ఫంక్షన్ హాలులో సోమవారం వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికే 95 శాతం అమలు చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకే సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమించినట్టు తెలిపారు. పార్టీ అప్పగించిన పనిని చిత్తశుద్ధితో చేయాలన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి భరత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్మన్ కుడుపూడి సత్యశైలజ, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, అడపా పార్థసారథి, చిక్కాల లక్ష్మణరావు, నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల రాజ్యలక్ష్మి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నిబంధనలు పాటించాలి

- జేసీ ఇలక్కియ



అల్లిపూడి ఆర్బీకేలో సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

కోటనందూరు: ధాన్యం సేకరణలో రైసు మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రైసు మిల్లర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే తరుగు తీసుకోవాలన్నారు. రైతుల పరంగా మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. అనంతరం కోటనందూరు-1, అల్లిపూడి రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. అక్కడ ధాన్యానికి తీస్తున్న తేమ, ముక్కశాతం తీరును పరిశీలించారు. రైతులకు నష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని వీఏఏలను ఆదేశించారు. మండలంలో 100 శాతం ధాన్యం సేకరణ పూర్తయ్యే వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయన్నారు. అనంతరం ధాన్యం తూకం వేస్తున్న వేబ్రిడ్జిని పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండలాధ్యక్షుడు సుర్ల రాజు, డీఎం పుష్పమణి, ఏఓ చంద్రశేఖర్, ఏఈఓ శివకుమారి, వీపీఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు గడువు పెంచాలని వినతి



ప్రత్తిపాడులో తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎస్ నాయకులు

ప్రత్తిపాడు: రైతుల నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు గడువు పెంచాలని కాకినాడ జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి కోరారు. ఈ నెల 10వ తేదీతో ఆర్బీకేల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోలును నిలిపివేస్తారనే వదంతుల నేపథ్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు గడువు పెంచాలని బీకేఎస్ నాయకులు ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి మాట్లాడుతూ జిల్లా లో సగానికి పైగా వరి కుప్పలపై ఉందన్నారు. మెట్ట ప్రాంతంలో ఆపరాల పంట వేయడంతో దారులు లేక ఖరీఫ్ పంట నూర్పులు జరగలేదన్నారు. మార్చి వరకు ధాన్యం కొనుగోలుకు గడవు పెంచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, నాయకులు భేరి రాము, శింగిలిదేవి అప్పారావు, కందా వీరాస్వామి, జె.బాలాదిత్య, గన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వ్యాధి నిరోధక టీకాలు



తుని ఆసుపత్రిలో రోగికి హెపటైటిస్-బి టీకా వేస్తున్న సిబ్బంది

తుని: కాలేయ వ్యాధి నుంచి రక్షణ పొందేందుకు హెపటైటిస్ బి వైరస్ టీకా (వ్యాక్సిన్) సమర్థవంతంగా పని చేస్తుందని జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ విభాగం అధికారి డాక్టర్ ఆర్. రమేష్ అన్నారు. తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో సోమవారం హెచ్‌ఐవీ బాధితులకు ఉచితంగా టీకాలను వేశారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన 58 మందికి టీకాలు వేసినట్టు డాక్టర్ రమేష్ తెలిపారు. లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ నరేష్, డాక్టర్ జగన్మోహనరావు, ఏఆర్‌టీ మెడికల్ అధికారి డాక్టర్ శిరీష, డీపీఎం.ఆదిలింగం, రత్నరాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ ప్రతినిధులకు సత్కారం



తునిలో కాంట్రాక్టు అధ్యాపకులు అసోసియేషన్ ప్రతినిధులను సత్కరిస్తున్న సిబ్బంది

తుని: కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ కార్యవర్గాన్ని తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ ఎస్.సుజాత ఆధ్వర్యంలో సత్కరించారు. అసోసియేషన్ కాకినాడ జిల్లా రాష్ట్ర కౌన్సిలర్ డి.మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అచ్యుతంబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.ప్రవీణ్‌కుమార్‌లను అధ్యాపకులు, సిబ్బంది శాలువాలతో సన్మానించారు. సంఘం పటిష్టతకు కలిసి పనిచేయాలని ప్రిన్సిపాల్ సుజాత సూచించారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

రౌతులపూడి: బీహార్‌లోని పాట్నాలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకూ జరిగే సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు పిలుపు నిచ్చారు. ఈ మేరకు స్థానిక రౌతులపూడిలో సోమవారం లిబరేషన్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్, సినిమా సెంటర్ మీదగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.జనార్దన్, సామిరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో నేడు గడపగడపకూ..

ప్రత్తిపాడు రూరల్: మండల కేంద్రమైన ప్రత్తిపాడులో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్



తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మారూఫ్

తుని: రైళ్లలో సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. తుని జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుని మండలం కొలిమేరు గ్రామానికి చెందిన నాగబాబు రైళ్లు, రైల్వే స్టేషన్లలో చార్జింగ్ పెట్టిన సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్‌లను దొంగిలించి విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. తుని రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నాగబాబును అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీ వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. నిందితుడి నుంచి పోలీసులు ఒక ల్యాప్‌టాప్, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. జీఆర్పీ సీఐ డి.రామారావు, ఏఎస్సై గోవిందరావు, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ



గోకవరంలో లబ్ధిదారులకు బీమా చెక్కులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలకు సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు బీమా చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 15 మంది లబ్ధిదారుల కుటుంబాలకు రూ.15 లక్షలు విలువైన వైఎస్సార్ బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్శయ్య, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, ఈఓపీఆర్డీడీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు



చినశంకర్లపూడిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లోటస్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఈశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వరరావు 45 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నలుగురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారికి విశాఖపట్నంలో శస్త్ర చికిత్స చేయనున్నట్లు సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు.

చినశంకర్లపూడిలో...

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి గ్రామ సచివాలయం వద్ద సోమవారం 104 సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. 104 వాహన సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపీటీసీ పిల్లా కొండలరావు, పెనుపోతుల నాగేశ్వరరావు, గజ్జల లోవరాజు పాల్గొన్నారు.

సూరంపాలెం ఆదిత్యలో...

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాలలో ఈ వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ ప్రారంభించారు. కాకినాడ అపోలో సన్‌షైన్ ఆసుపత్రి వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థులు, వైద్య సిబ్బందికి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి



తునిలో హెల్మెట్ ధారణపై మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

తుని: సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ రక్షణ కవచంగా పని చేస్తుందని తుని పట్టణ ఎస్సై సీహెచ్ గోపాలకృష్ణ అన్నారు. ద్విచక్ర వాహనదారులు, ప్రజలకు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తూ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం రోడ్డు, బాలాజీ సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా గొల్ల అప్పారావు సెంటర్, జీఎస్‌టీరోడ్డులో హెల్మెట్ ధరించి ర్యాలీ చేశారు. హెల్మెట్‌ధారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



తంటికొండలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: మండలంలోని తంటికొండలో ఆదివారం రాత్రి తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే..స్థానిక ఎస్సీ కాలనీలోని ఆకుమూరి వెంకటేశులుకు చెందిన తాటాకింటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేసినా ఫలితం లేదు. మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలు నిరాశ్రయులు కాగా సుమారు రూ.లక్ష ఆస్తినష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం బాధితులను పరామర్శించి రూ.3 వేలు నగదు, బియ్యం, నిత్యావసరాలు అందించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), సర్పంచ్ బద్దిరెడ్డి నారాయణమ్మ, అప్పన్నదొర, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు బాధిత కుటుంబాలకు చేయూతనందించారు. అలాగే స్థానిక టీడీపీ నాయకులు బాధితులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వాహనాల తనిఖీ



గోపాలపట్నంలో వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న కత్తిపూడి ఎంవీఐ శ్రీనివాస్

తొండంగి: వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. గూడ్స్, ప్రైవేటు వాహనాలకు రిజిస్ట్రేషన్, బీమా, పొల్యూషన్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర రికార్డులు పరిశీలించి సక్రమంగా లేని వాహనదారులకు అపరాధ రుసుము విధించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు.